క్లుప్తంగా

జూనియర్ సివిల్ జడ్జిలుగా యువ న్యాయవాదులు


మన్సూర్


మధులికతేజ

షాద్‌నగర్: పట్టణానికి చెందిన యువ న్యాయవాదులు మన్సూర్, మధులికతేజ పరీక్షల్లో ఉత్తీర్ణులై జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికయ్యారు. యువ న్యాయవాదుల ఎంపికపై బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే ప్రతిభ కనబరిచి జూనియర్ సివిల్ జడ్జిలుగా ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థానానికి చేరుకోవడం అభినందనీయమని గురువారం వారిని పలువురు అభినందించారు.

అడ్వాన్స్ పన్నుపై రాయితీ గడువు పొడిగింపు

మున్సిపల్ కమిషన్ పూర్ణచందర్

చేవెళ్ల: మున్సిపాలిటీలో ఈ ఏడాది 2025–26 సంవత్సరానికి గాను ముందుగా(అడ్వాన్స్) ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం కల్పించిన 5శాతం రిబేట్(రాయితీ)గడువును ఈ నెల 7వ తేదీవరకు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి ఏటా మున్సిపాలిటీలలో అడ్వాన్స్‌గా పన్నులు చెల్లించే వారికి రాయితీని ప్రకటిస్తుందన్నారు. ఈ ఏడాది కూడా ఏప్రిల్ 30వరకు ముందుగా గడువును అందించిన ప్రభుత్వం దీనిని మళ్లీ మే 7వ తేదీవరకు పొడిగించిందని పేర్కొన్నారు. ముందుగా చెల్లించే వారికి 5శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ గడువు కూడా ఈ నెల 3వ తేదీవరకు పొడిగించినట్లు తెలిపారు. ప్లాట్ల యజమానులు తమ ప్లాట్లకు సంబంధించిన ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించి రాయితీని పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కారు అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌లు వేస్తే చర్యలు

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్


కారు అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌లు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మొయినాబాద్‌రూరల్: కారు అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌లు వేసి ప్రయాణిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ అన్నారు. గురువారం హిమాయత్‌నగర్ సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారుల నుంచి పెండింగ్ చలాన్‌లు కట్టించారు. కొన్ని కార్లకు బ్లాక్ అద్దాలు ఉండడంతో వాటిని తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ చలాన్‌లను వెంటనే చెల్లించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ అంజయ్య, ట్రాఫిక్ కానిస్టేబుల్స్ యాదగిరి, ఇమ్రాన్ ఉన్నారు.

ఆగని అక్రమ దందా!

అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఇసుక, మట్టి రవాణా

- రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా తరలింపు
- ట్రాక్టర్‌కు రూ.4 నుంచి 6వేల వరకు అర్జిస్తున్న వ్యాపారులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు


హైతాబాద్ ప్రభుత్వ భూమిలో నుంచి జేసీబీతో మట్టి తవ్వకాలు


ఈసీ వాగులో నుంచి ఇసుక రవాణా

షాబాద్: మండలంలో జోరుగా ఇసుక, మట్టి అక్రమ దందా జోరుగా జరుగుతోంది. ప్రభుత్వ భూములు, వాగుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టిని తరలించుకుపోతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులతో పాటు ఇతర నాయకుల అండదండలతోనే ఈ అక్రమ దందా కొనసాగుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాత్రివేళల్లో తరలింపు

మండలంలోని ఈసీ వాగులో నుంచి ఇసుక, హైతాబాద్, చిన్నసోలీపేట్ గ్రామాల్లో నుంచి మట్టి దందా జోరుగా సాగుతున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా సంబంధిత అధికారులు పెద్దగా స్పందించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రాత్రిపూట జోరుగా అక్రమ రవాణా కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ భూమిలో నుంచి మట్టి తరలిస్తున్నాఅధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులకు ఫోన్ చేసి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.4 వేల నుంచి 6 వేల వరకు..

మండలంలోని నాగర్‌గూడ, తిమ్మారెడ్డిగూడ, ఏట్ల ఎర్రవల్లి, తాళ్లపల్లి, చందనవెల్లి, రుద్రారం, హైతాబాద్, చిన్న సోలీపేట్ తదితర గ్రామాల మీదుగా ఈసీ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ట్రాక్టర్ ఇసుక రూ.4వేల నుంచి 6వేల వరకు విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఒక టిప్పర్ మట్టిని రూ.7వేల నుంచి 10వేల విక్రయిస్తున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని వాగులు నేడు పెద్దగోతులు, గుంతలమయంగా తయారై ఏడారిని తలపిస్తున్నాయి. మండలంలోనే కాకుండా చుట్టుపక్కన మండలాలకు కూడా స్థానిక వ్యాపారులు ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్నారు. ప్రతీ రోజు రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామువరకు వ్యాపారం సాఫీగా కొనసాగుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల శాఖ అధికారులు తమ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు కూడా ఇసుక, మట్టిని తరలించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వకున్నా వ్యాపారులు తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అక్రమ రవాణా ఇసుక, మట్టిని కట్టడిచేసే బాధ్యతను పోలీస్‌శాఖ నుంచి రెవెన్యూశాఖకు అప్పగించడంతో వారిని ఎవరూ ఆపడంలేదు. వాగులు ఏడారిగా మారిపోవడంతో ప్రస్తుతం నామమాత్రంగా పనిచేస్తున్న బోరుబావులు సైతం ఎండిపోయే దశకు చేరుకున్నాయి. మండల అధికారులు వెంటనే స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అసలు అధికారులేం చేస్తున్నట్లు?

మండలంలో పెద్దఎత్తున మట్టి, ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారుల కళ్ల ముందు నుంచి ట్రాక్టర్లలో ఇసుక, మట్టి తరలిస్తున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణాపై అధికారులను ప్రశ్నిస్తే లిఖితపూర్వకంగా తమకు రాసి ఇస్తేనే చర్యలు తీసుకుంటామని, తమ దృష్టికి రానప్పుడు ఎలా స్పందిస్తామని చెబుతున్నారు. అధికారుల దృష్టికి వస్తేనే పట్టించుకుంటారో, మానవ మనుగడను దృష్టిలో పెట్టుకొని తగిన చర్యలు తీసుకుంటారో వారికే తెలియాలి.

పట్టించుకున్న నాథుడే లేడు



రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక, మట్టి రవాణా జరుగుతున్న మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదు. రాత్రివేళల్లో కూడా వందల ట్రాక్టర్లతో ఇసుక తోడేస్తున్నారు. టిప్పర్లలో నిండుగా మట్టిని వేసి నిబంధనలకు విరుద్ధంగా వాహనాన్ని నడుపుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదు. దీనిని కట్టడి చేయాలి.

– యాదయ్య, చందనవెల్లి

చర్యలు తీసుకుంటాం



ఈసీ వాగులో నుంచి అక్రమంగా ఇసుక, మట్టిని రవాణా చేస్తున్నారని తమ దృష్టికి వచ్చింది. అలాంటి వారిపై నిఘా ఉంచి కేసులు నమోదు చేస్తాం. వాహనాలను కూడా సీజ్ చేశాం. మండలంలోని ఏ గ్రామంలోనైనా వాగుల్లో నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్టు కనిపిస్తే మాకు సమాచారం అందించండి. ట్రాక్టర్‌లను సీజ్ చేసి వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– కాంతారెడ్డి, సీఐ, షాబాద్

ఎవరికీ అనుమతి ఇవ్వలేదు



ఇసుక, మట్టి రవాణా చేసుకునేందుకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే పట్టుకుంటాం. పని ఒత్తిడితో తనిఖీలు నిర్వహించలేదు. ఇసుక, మట్టి అక్రమ రవాణాను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎండీ అన్వర్, తహసీల్దార్, షాబాద్

ఉత్తమ విద్యార్థులకు సత్కారం


ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

షాద్‌నగర్: పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల డైరెక్టర్ ఎంఏ సత్తార్, ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా తెలిపారు. విద్యార్థి బ్రాహ్మణి 582 మార్కులు సాధించి టౌన్ టాపర్‌గా నిలిచిందన్నారు. అదేవిధంగా అంజలి 570, మరియం 563, అంకిత 561, సాత్విక 560, సమీర్ 544 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు.

కులగణన దేశానికే ఆదర్శం


షాద్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ తాలుకా అధ్యక్షుడు చంద్రశేఖర్

షాద్‌నగర్: రాష్ట్రంలో నిర్వహించిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ తాలుకా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధినేత రాహుల్ గాంధీ నిర్వహించిన జోడో యాత్రలో కులగణన నిర్ణయం తీసుకున్నారని, ఇందులో భాగంగా తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేపట్టారన్నారు. బీసీలకు 32 శాతం ఉన్న రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించిన మేధావి కేసీఆర్ అని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించి అసెంబ్లీలో తీర్మానం చేయించారన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేపట్టడంతో కేంద్రం తలొగ్గి కులగణన చేసేందుకు నిర్ణయించిందన్నారు. అదేవిధంగా తెలంగాణలో కులగణన విషయంపై కేంద్రం మెచ్చుకుంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్, ఈటల రాజేందర్ అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు జంగ నర్సింహాయాదవ్, రాజు, హరినాథ్‌రెడ్డి, ఇబ్రహీం, బస్వం, గంగనమోని సత్తయ్య, రాజేశ్‌గౌడ్, గోపాల్, కృష్ణయ్య, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

కేశంపేట: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో గురువారం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సర్వేతో రిజర్వేషన్ల సమస్య పరిష్కారమవుతుందన్నారు. కులగణనతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, సురేష్‌రెడ్డి, రమేశ్, తైదా పర్వతాలు, రాణి, అనసూయ, రాములు, నర్సింహారెడ్డి, గ్యార సురేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వద్ద కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురువారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500ల బోనస్‌ను అందిస్తుందని తెలిపారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంద, దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గంగ్ర జగదీశ్వర్‌గౌడ్ ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ వీరేశ్ సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ అనిల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి


మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన విద్యనందించాలని శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో 50శాతమే విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం దారుణమని ఆరోపించారు. దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించి, తక్షణమే ప్రక్షాళన చేపట్టాలని కోరారు.

ఘనంగా మేడే వేడుకలు

ప్రపంచ కార్మిక దినోత్సవం 'మేడే'ను గురువారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ర్యాలీలు, కార్మిక జెండాలను ఆవిష్కరించి వేడుకలు జరుపుకొన్నారు. మేడే కార్మికుల ఐక్యత, పోరాటాలకు నిదర్శనంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. హక్కులు, చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలపై ఐకమత్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.


షాద్‌నగర్: జెండా ఆవిష్కరణలో కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్, నాయకులు


చేవెళ్ల: చేవెళ్లలో జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు


మొయినాబాద్‌రూరల్: జెండా ఎగురవేస్తున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవందర్


షాద్‌నగర్: ర్యాలీలో పాల్గొన్న టూవీలర్ అసోసియేషన్ నాయకులు


కేశంపేట: మేడే వేడుకల్లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు


మొయినాబాద్: జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి


కొందుర్గు: మండల కేంద్రంలో..


శంకర్‌పల్లి: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


కొత్తూరు: జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు


షాబాద్: అంతారం మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం వద్ద..


షాబాద్‌లో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య


షాద్‌నగర్: జెండా ఆవిష్కరణలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు